

అచ్చెన్న చెప్పేవన్నీ అవాస్తవాలు : వైసిపి

ప్రజాశక్తి - పోలాకి

వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అవాస్తవాలు చెప్తున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో విమర్శించారు. మిర్చి రైతులు గిట్టుబాటు ధరల్లేక సతమతమవుతుంటే... గత ప్రభుత్వంలో రేటు పలికిందా అని మాట్లాడడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వంలో మిర్చికి మార్కెట్‌లో రూ.27 వేల వరకు గరిష్టంగా ధర పలికిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించని మిర్చి సహా ఇతర పంటలకూ జగన్ ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించిందని తెలిపారు. వైసిపిపై తప్పుడు ప్రచారాలు మాని.. రైతులను ఆదుకోవడంపై దృష్టిసారించాలని హితవు పలికారు.

ఈ ఏడాదైనా పూర్తయ్యేనా..?

- ఆగిన వంశధార, నాగావళి అనుసంధాన పనులు
- భూసేకరణ బిల్లుల పెండింగ్‌తో నిలిచిన కాలువ తవ్వకాలు
- బడ్జెట్‌లో నిధుల కేటాయింపులపైనే ఆశలు
- జూన్ వరకు ఒప్పంద కాలపరిమితి పొడిగింపు

వంశధార - నాగావళి నదుల అనుసంధాన పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం ప్రాధాన్యత ప్రాజెక్టుగా గుర్తించామని చెప్పినాచ ప్రాజెక్టు పూర్తి చేయడంలో ఆ రకమైన శ్రద్ధ కనబరచలేదు. దీంతో ఇప్పటికీ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఒప్పందం ప్రకారం గతేడాది జూన్ నాటికి పూర్తి కావాల్సి ఉంది. ఆ తర్వాత డిసెంబరు వరకు ప్రస్తుతం ఈ ఏడాది జూన్ వరకు ఒప్పంద కాలపరిమితిని పొడిగించారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు పనుల ప్రగతిపై దృష్టిసారించలేదు. కాలువ తవ్వకాలకు సేకరించిన భూములకు చెల్లింపులు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తేనే ముందుకు సాగుతాయి. కాలువ తవ్వకాలకు కొన్నిచోట్ల కోర్టు కేసులూ ఉండడం మరో కారణంగా ఉంది. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో, అర్ధాంతంగా పనులు ఆపేశారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



బూర్జ మండలం కొల్లివలస, సింగన్నపాలెం మధ్య అసంపూర్తిగా హైలెవల్ కెనాల్ పనులు

వంశధార, నాగావళి నదుల అనుసంధానంలో భాగంగా హిరమండలం రిజర్వాయర్ గట్టుకు రెండు తూములు ఏర్పాటు చేసి అక్కడ నుంచి 33.58 కిలోమీటర్ల మేర నారాయణపురం వరకు కాలువ తవ్వాల్సి ఉంది. హిరమండలం వద్ద నీటిని సరఫరా చేసే చోట 43.7 మీటర్ల స్థాయిలో, నారాయణపురం ఆనకట్ట వద్ద కాలువ కలిసే చోట 29.09 మీటర్లు నిర్మించేలా డిజైన్ చేశారు. తద్వారా ఏటవాలుగా నీరు ప్రవహించి ఆనకట్టకు చేరుతుంది. నదుల అనుసంధానం పూర్తి చేస్తే ఎల్.ఎన్ పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో ఉన్న ఐదు వేల ఎకరాలకు సాగునీరందుతుంది. దీంతోపాటు నారాయణపురం ఆనకట్ట ప్రధాన కాలువల కింద ఉన్న 37,053 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది.

పెరిగిన ప్రాజెక్టు వ్యయం

వంశధార, నాగావళి నదుల పనులను రూ.84.90 కోట్ల వ్యయంతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 27, 2017లో పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. ప్రాజెక్టు పనులను నెల్లూరుకు చెందిన పి.వి రమణయ్య అండ్ కంపెనీకి రూ.57.99 కోట్లకు పనులను అప్పగించింది. అనుసంధాన పనులు 2020 నాటికే పూర్తి కావాల్సి ఉంది. పలుమార్లు ఒప్పంద కాలపరిమితిని పొడిగించినా, పనులు పూర్తి కాలేదు. అంచనా వ్యయాన్ని సవరించి రూ.145.34 కోట్లకు పెంచింది. ఇప్పటివరకు రూ.85.71 కోట్లను వెచ్చించారు.

భూసేకరణ చెల్లింపుల్లో జాప్యం

హైలెవల్ కెనాల్ పనులకు సంబంధించి భూసేకరణ పూర్తయినా, ప్రభుత్వం నేటికీ రైతులకు డబ్బులు చెల్లించలేదని తెలుస్తోంది. కాలువ తవ్వకాలకు మరో 49.23 ఎకరాల భూమి అవసరమని అధికారులు గుర్తించారు. భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరించినా, ప్రభుత్వం డబ్బులు ఇవ్వడం లేదు. ఇందుకోసం రూ.8.26 కోట్లు కావాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదని తెలుస్తోంది. కాంట్రాక్టర్‌కు రూ.కోటి మేర బకాయిలు చెల్లించపోవడంతో, పనులు అర్ధాంతరంగా ఆపేసి వెళ్లిపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

కాలువ పనులకు అడ్డంకిగా కోర్టు కేసులు

బూర్జ మండలం చినలంకాంలో కాలువ నిర్మాణం కోసం దేవాదాయ, ధర్మాదాయశాఖకు చెందిన సుమారు 7.5 ఎకరాలు అవసరం పడింది. వంశధార అధికారులు పరిహారం కింద దేవాదాయ, ధర్మాదాయశాఖకు రూ.1.50 కోట్లు చెల్లించేశారు. భూముల్లో 13 మంది రైతులు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. చట్టం ప్రకారం పరిహారంలో 60 శాతం దేవాదాయ, ధర్మాదాయశాఖకు, 40 శాతం కౌలు రైతులకు ఇవ్వాల్సి ఉంది. కౌలు రైతులకు పరిహారం చెల్లింపునకు సిద్ధమవుతున్న తరుణంలో ఆ భూములకు దేవాలయానికి ఇచ్చిన ధర్మదాత పరిహారం ఇవ్వాల్సి వస్తే తనకు ఇవ్వాలని, లేకుంటే దేవాదాయశాఖకు చెందాలంటూ కోర్టును ఆశ్రయించాడు. దీంతో బూర్జ మండలం చినలంకాం పరిధిలో 700 మీటర్ల మేర కాలువ తవ్వకాలకు బ్రేక్ పడింది. నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గంలో కాలువ నిర్మిస్తామని అధికారులు చెప్తున్నారు. కూటమి ప్రభుత్వం చొరవ చూపి బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో పాటు సమస్యలకు పరిష్కారం చూపితేనే వంశధార-నాగావళి అనుసంధానం పనులు త్వరితగతిన పూర్తయి రైతుల కల నెరవేరే అవకాశాలు కనిపిస్తున్నాయి.



ప్రపంచ గమనానికి...

కమ్యూనిస్టు ప్రణాళిక దిక్సూచి

- మార్క్సిజంతోనే మానవాళికి విముక్తి
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు
- రెడ్ బుక్ డేలో లెనిన్ గ్రంథ అధ్యయనం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కమ్యూనిస్టు ప్రణాళికతోనే శ్రామికవర్గ విముక్తి అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి అన్నారు. రెడ్ బుక్ డేను పురస్కరించుకుని నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో లెనిన్ శత వర్ధంతి సందర్భంగా ఆయన రాసిన 'రాజ్యం-విప్లవం' గ్రంథాన్ని అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికీ పరిష్కార మార్గం చూపించే మహోన్నత సిద్ధాంతం మార్క్సిజమేనని అన్నారు. 1848 ఫిబ్రవరి 21న 50 పేజీల కమ్యూనిస్టు ప్రణాళికను మార్క్స్, ఏంగిల్స్ రచించారని, అదే మానవాళికి దిక్సూచిగా ఉందన్నారు. మహోన్నత సిద్ధాంతాన్ని మార్క్స్, ఏంగిల్స్ అందిస్తే, లెనిన్ దాన్ని అప్పటి నిర్దిష్ట పరిస్థితుల్లో తన ఆలోచన చేర్చి ఆచరణలో ప్రపంచంలోనే మొట్టమొదట సామ్యవాద కల సాకారం చేశారని చెప్పారు. పెట్టుబడిదారీ పాలనలో ప్రజల సమస్యలు పరిష్కారం కావని, ప్రజలను దోపిడీ చేయడమే దాని లక్ష్యమన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, దోపిడీ పీడన, ప్రజల ఆస్తుల లూటీ జరుగుతోందని విమర్శించారు.

కేంద్రంలో బిజెపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రకృతి సంపదను, ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. ప్రజల ఆస్తులను కార్పొరేట్ ఆస్తులుగా మార్చేస్తోందన్నారు. సముద్ర తీర ప్రాంతాల్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు ప్రణాళిక ద్వారా దోపిడీ లేని, అందరికీ అన్ని అవకాశాలు ఉండే సమాజం ఉందని, అదే సోషలిస్టు సమాజమని తెలిపారు. అందరికీ అన్ని అవకాశాలు ఉండే సమాజం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.సింహాచలం, జిల్లా కమిటీ సభ్యులు కె.నాగమణి, నాయకులు కె.శ్రీనివాసు, కొత్తకోట అప్పారావు, కె.సూరయ్య, ఎం.గోపి, ఆర్.ప్రకాష్, ఎ.సత్యం తదితరులు పాల్గొన్నారు.

మార్కెటింగ్ శాఖ ద్వారా టమోటా కొనుగోలు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

మార్కెటింగ్ శాఖ ద్వారా ప్రభుత్వమే టమోటా పంటను కొనుగోలు చేస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, స్థానిక ఎన్‌టిఆర్ భవన్‌లో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆయన మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా టమోటా కొనుగోలును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. నేరుగా రైతుబజారుల్లో విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గుంటూరు మిర్చి యార్డు వద్ద మాజీ ముఖ్యమంత్రి జగన్ గగ్గోలు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన హయాంలో రూ.ఏడు వేలు మాత్రమే మద్దత ధర ఇచ్చి, ఇప్పుడు మిర్చి రైతులకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తుందనడం విడ్డూరంగా ఉందన్నారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని భ్రష్టు పట్టించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్కో వ్యవస్థను గాడిలో పెడుతోందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.



ప్రజా దర్బార్‌లో సమస్యలు వింటున్న మంత్రి అచ్చెన్నాయుడు

గంజాయి తరలిస్తున్న నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగుపురం సమీపాన జాతీయ రహదారికి ఆనుకుని హటకేశ్వర స్వామి ఆలయం వద్ద అక్రమంగా గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎఎస్‌పి కె.వి రమణ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను ప్రవేశపెట్టి కేసు వివరాలను వెల్లడించారు. శ్రీకాకుళం మండలం పాత్రునివలసకు చెందిన ధర్మాన ప్రవీణ్, బైరివానిపేటకు చెందిన బగ్గు నవీన్, శ్రీకాకుళం నగరంలోని కొత్త దమ్మలవీధికి చెందిన చీకటి యోగీశ్వరరావు, పెద్దరెల్లివీధికి చెందిన జలగడుగుల తార వికాస్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. హటకేశ్వర స్వామి ఆలయ సమీపాన ఈ నలుగురు అనుమానాస్పద స్థితిలో కనిపించడంతో రూరల్ ఎస్ఐ కె.రాము సిబ్బందితో కలసి వారిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకుని వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్న ఎస్ఐ రాము, సిబ్బంది ఢిల్లీశ్వరరావు, కృష్ణమూర్తి, సన్యాజ్, వరదరాజులు, వాసుదేవరావు రాంబాబును అభినందించారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎఎస్‌పి రమణ



ధర్నా చేస్తున్న బ్యాంకు అధికారులు, ఉద్యోగులు

మార్చి 24, 25న బ్యాంకుల సమ్మె

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పలు సమస్యల పరిష్కారం కోరుతూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యాన మార్చి 24, 25 తేదీల్లో బ్యాంకుల సమ్మె చేపడుతున్నట్లు యూనియన్స్ జిల్లా కన్వీనర్ కె.సిహెచ్ వెంకటరమణ తెలిపారు. ఈ సమ్మెలో సుమారు పది లక్షల ప్రభుత్వరంగ బ్యాంకు ఉద్యోగులు, అధికారులు పాల్గొంటున్నారని చెప్పారు. పలు డిమాండ్లతో నగరంలోని స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వరంగ బ్యాంకులను పరిరక్షించాలని, బలోపేతం చేయాలని... ఉద్యోగులు, అధికారులు తగిన సంఖ్యలో నియమించాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల్లో పని ఒత్తిడి విపరీతంగా ఉన్నందున వారానికి ఐదు రోజులు పని దినాలు కేటాయించాలన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఖాతాదారుల ముఖ్యమైన సమాచారం, ముఖ్యమైన ఫైళ్లు, నగదుతో కూడిన వ్యవహారం ఉన్నందున అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు నియమించకూడదన్నారు. వారి స్థానంలో పర్మినెంట్ ఉద్యోగ నియమకాలు చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల్లో ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గ్రాట్యుటీ రూ.25 లక్షలకు పెంచడమైందని, అందుకనుగుణంగా ప్రభుత్వరంగ బ్యాంకు ఉద్యోగులకూ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించి, వాటిని ప్రభుత్వరంగ బ్యాంకులకు రుద్దడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇటీవల 12వ వేతన సవరణలో భాగంగా మిగిలి ఉన్న డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎస్‌బిఐ ఆఫీసర్స్ అసోసియేషన్ రీజనల్ సెక్రటరీ కృష్ణ కిషోర్, నాయుడు, ఎఐబిఒసి నాయకులు కిషోర్, బిఇఎఫ్ఐ నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఎఐబిఇఎ నాయకులు శ్రావణి, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తా...

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి

ప్రజాశక్తి - అరకులోయ రూరల్, చింతపల్లి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తానని యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. ఆమె శుక్రవారం అల్లూరి జిల్లాలోని చింతపల్లి, హుకుంపేట, అరకులోయ మండలాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలు పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులను కలిసి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ క్రమంలో అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంతో తీవ్ర నష్టం జరుగనుందని, దీనికి వ్యతిరేకంగా పోరాటం చేస్తానని అన్నారు. 117 జిఒను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీన్ని రద్దు చేసినట్టు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ నిజానికి ఆ జిఒ రద్దు కాలేదని తెలిపారు. ప్రత్యామ్నాయంగా కొన్ని అంశాలను తీసుకొచ్చి అమలు జరుపుతున్నారన్నారు. దీని వల్ల ప్రాథమిక, మాధ్యమిక విద్యకు ప్రమాదం వాటిల్లనుందన్నారు. హైస్కూల్‌లో పదో తరగతి పాస్ అయిన తర్వాత చదువుకునేందుకు పెట్టిన ఇంటర్మీడియట్ వ్యవస్థను రద్దు చేయాలనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుందని, దాన్ని రద్దు చేయకుండా కాపాడుకోవడానికి ప్రయత్నం చేస్తామని చెప్పారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణకు కృషి చేస్తానన్నారు. కెజిబివిల్లో మినిమం టైం స్కేల్ అమలు చేయకుండా అక్కడి ఉద్యోగులను ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోందన్నారు. ఆదివాసీలకు ఏజెన్సీలో శత శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించే జిఒ నెంబర్ 3ని పునరుద్ధరించాలని శాసన మండలిలో గొంతెత్తుతానన్నారు. ప్రభుత్వం 1/70 చట్టానికి సవరణ చేయాలన్న ప్రయత్నాన్ని మానుకోవాలన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల గొప్పతనాన్ని గుర్తుచేశారు. ప్రచార కార్యక్రమాల్లో యుటిఎఫ్, ఐద్వా, సిఆర్‌టిల సంఘం, సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం గిరిజన సంఘం, జనవిజ్ఞాన వేదిక నాయకులు పాల్గొన్నారు.



చింతపల్లి మండలం వంగసార పాఠశాలలో ప్రచారం చేస్తున్న విజయగౌరి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

జిల్లాను ప్రగతిపథంలో నిలపాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం


అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ జిల్లాను ప్రగతిపథంలో నిలపాలని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. జిల్లా అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో జిల్లాపరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను శుక్రవారం నిర్వహించారు. 2, 4, 7వ స్థాయీ సంఘాల సమావేశాలు ఆమె అధ్యక్షతన నిర్వహించారు. పారిశుధ్యం, రోడ్లు, భవనాలు, విద్యుత్, నీటిపారుదల శాఖలు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, జిల్లా పంచాయతీ, గృహనిర్మాణ సంస్థ, వైద్యారోగ్యశాఖల వారీగా సమీక్షలు నిర్వహించి సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. వృద్ధాప్య, వితంతు పింఛన్ల పంపిణీపై సరుబుజ్జిలి జెడ్‌పిటిసి ఎస్.నాగేశ్వరరావు ప్రశ్నించగా, డిఆర్‌డిఎ పీడీ అందుకు సంబంధించిన వివరాలను వివరించారు. పలు శాఖలకు సంబంధించి సమీక్షలు చేశారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి శ్రీధర్ రాజు, పలు శాఖల అధికారులు, జెడ్‌పిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందుల్లేకుండా ఫ్లై ఓవర్ నిర్మాణం

ప్రజాశక్తి - రణస్థలం

జాతీయ రహదారుల సంస్థ గతంలో చెప్పినట్లు గానే ప్రజలకు ఇబ్బందుల్లేకుండా రణస్థలంలో ఓపెన్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి చర్యలు చేపడుతుందని ఆ సంస్థ డిప్యూటీ మేనేజర్ సతీష్ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రణస్థలం ఫ్లైఓవర్ వ్యతిరేక పోరాట కమిటీ, పోలీస్, రెవెన్యూ, సర్వే, జాతీయ రహదారి విస్తరణ అధికారులతో సమన్వయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లైఓవర్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. రణస్థలంకు బైపాస్ నిర్మాణం చేయడానికి కుదరదని స్పష్టం చేశారు. మాజీ ఎంపిపి డి.జి.ఎం ఆనందరావు, సర్పంచ్ బి.రమణ, మాజీ ఎంపిటిసి తిరుపతి రాజు తదితరులు మాట్లాడుతూ రణస్థలంలో ఫ్లైఓవర్ నిర్మాణం వల్ల అనేక ఇబ్బందులు ఉన్నాయని, నిర్మాణాన్ని విరమించు కోవాలని కోరారు. బైపాస్ నిర్మాణం వల్ల భవిష్యత్‌లోనూ ఉపయోగపడుతుందని, ప్రభుత్వానికి ఖర్చు తగ్గుతుందని స్పష్టం చేశారు. చివరకు అధికారులు ఫ్లైఓవర్ నిర్మాణమే చేపడతామని, పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఈ రోడ్ల వల్ల ఇబ్బంది కలుగుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. మరోసారి సమావేశమై ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని కమిటీ నాయకులు అధికారులను కోరారు. సమావేశంలో తహశీల్దార్ ప్రసాదరావు, ఉప తహశీల్దార్ నారాయణమూర్తి, మండల సర్వేయర్ రవికుమార్, సిఐ అవతారం, జె.ఆర్ పురం ఎస్ఐ చిరంజీవి, రహదారి విస్తరణ సైట్ ఇంజనీర్ మహేష్, మండల కేంద్రానికి చెందిన వ్యాపారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హైవే డిప్యూటీ మేనేజర్ సతీష్

గ్రూప్-2 పరీక్షలకు

ఏర్పాట్లు పూర్తి

డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎపిపిఎస్‌సి ఆధ్వర్యాన ఈనెల 23వ తేదీన నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం, ఎచ్చెర్లలో 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి పేపరు, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో పేపర్ పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు సమయపాలన పాటించాలని సూచించారు. పరీక్షకు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాలన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, కాలిక్యులేటర్, మొబైల్ ఫోన్, స్మార్ట్ వాచ్, బ్లూటూత్ తదితర వాటిని అనుమతించబోమని స్పష్టం చేశారు. హాల్ టిక్కెట్‌తో పాటు గుర్తింపు కార్డు తెచ్చుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాలకు సంబంధించి సందేహాలు ఉంటే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ ఫోన్ నంబరు 08942 240557 సంప్రదించాలని సూచించారు.


తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న టూరిజం, అటవీశాఖ అధికారులు

ఎర్రముక్కాం తీర ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి- సోంపేట

మండల పరిధిలోని ఎర్రముక్కం తీర ప్రాంతాన్ని జిల్లా టూరిజం శాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా టూరిజం శాఖ అధికారి నారాయణరావు, డిఎఫ్ఒ నాగరాజుతో పాటు స్థానిక అధికారులు ఎర్రముక్కం తీరంలోని సహజ సిద్ధంగా ఏర్పడిన ఇసుక దిన్నెలు, రాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా లేనివిధంగా ఈ ప్రాంతాల్లో సాహసిద్ధమైన రాళ్లు విశాలమైన తీరం పర్యాటకానికి ఎంతో అనువుగా ఉందన్నారు. ఈ ప్రాంతాన్ని టూరిజంగా అభివృద్ధి చేస్తే ఆదాయంతో పాటు ప్రజలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా ఎర్రముక్కం, యకుఊరు గ్రామాలకు చెందిన మత్స్యకారులు అధికారులతో మాట్లాడారు. ఈ ప్రాంతానికి ఉండే ప్రత్యేకత, ఇతర సౌకర్యాల దృష్ట్యా టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సచివాలయ ఉద్యోగులు, మత్స్యకార ప్రతినిధులు పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డిని కలిసిన జగన్నాయకులు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి


జగన్‌తో మాట్లాడుతున్న జగన్నాయకులు

సంతబొమ్మాళి మాజీ పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు గురువారం పాలకొండ పర్యటనకు వచ్చిన మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డితో టెక్కలి నియోజవర్గంలో వైసిపి కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని బేసి రామచంద్రపురం జాతీయ రహదారి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన గౌరీశంకర్ అనే వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ మేరకు స్థానికుల వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన గౌరీ శంకర్ ద్విచక్ర వాహనంపై హరిపురం వెళ్తుండగా బేసి రామచంద్రపురం సమీపంలోకి వచ్చేసరికి బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో గౌరీ శంకర్ తీవ్ర గాయాలు కావడంతో హైవే అంబులెన్స్ సిబ్బంది సహాయంతో బారువ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


గౌరీశంకర్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న హైవే అంబులెన్స్ సిబ్బంది

తేనెలొలుకు.. తెలుగు భాష


కవిటి : కళ్యాణి పాఠశాల విద్యార్థులు


జి.సిగడాం : పలు వేషధారణలో పాఠశాల విద్యార్థులు


ఆమదాలవలస : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణరావు

ప్రజాశక్తి- కవిటి

తేనెలాంటి మధురమైనది తెలుగు భాషని బివికె ప్రిన్సిపాల్ ఎం.అనిల్, కల్యాణి ఆంగ్ల పాఠశాల హెచ్ఎం బిందుమాధవి అన్నారు. బివికె, కల్యాణి ఆంగ్ల పాఠశాలల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దేశభక్తి, మాతృభాష విశిష్టత వివరించారు. బివికెలో విద్యార్థులకు కవితలు, పద్యాలు, కథలు, సామెతలు, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జి.సిగడాం: మాతృభాషా దినోత్సవం సందర్భంగా మండలంలో అద్దానంపేట ఎంపిపి స్కూల్‌లో వేడుకలు నిర్వహించారు. పద్యాల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వేసిన వేషధారణలు అందరిని ఆకట్టుకున్నాయి. అలాగే మండలంలో మోడల్ స్కూల్, జిల్లాపరిషత్ సిగడాం, సంతావురిటి తదితర పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు.

బూర్జ: మాతృభాషా దినోత్సవం సందర్భంగా మండలంలోని పెద్దపేట ప్రాథమిక పాఠశాలలో పద్యాల పోటీలు నిర్వహించారు. పొడుగు గౌతం ప్రథమ, బి.భార్గవి ద్వితీయ, పి.చరిష్మాలు తృతీయ స్థానం సాధించారు. అనంతరం హెచ్ఎం కె.గజలక్ష్మి, ఉపాధ్యాయుడు పి.చంద్రమౌళి మాతృభాష ప్రాముఖ్యతను వివరించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు.

ఆమదాలవలస : మండలంలోని తొగరాం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు వావిలపల్లి అచ్యుతరావు, విశ్రాంతి సాంస్కృత అధ్యాపకులు నక్క దామోదరరావు, వైస్ ప్రిన్సిపాల్ డి.పైడితల్లి, అధ్యాపకులు పి.రామారావు, వి.అచ్యుతరావు పి.సీతారాం, బి. శ్రీనివాసరావు, వై.రమణమూర్తి, బి.రవిబాబు, పి.శ్రీనివాసరావు, ఆర్.చంద్రశేఖర్, టి.హారిక, టి.శ్రీనివాసరావు, కాశీరత్నం, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కనుగులవలస ప్రాథమిక పాఠశాలలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు బొడ్డేపల్లి మోహనరావు, త్రినాథ, రమణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం నిర్వహించారు. స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తి రెడ్డి భరతమాత చిత్రపటానికి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు పద్మజ, మేనేజర్ కేసి పూరి, ఉపాధ్యాయులు సురేఖ, సునీత, శాంతి, శంకర్ శ్రీధర్, ఇంటరాక్ట్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ జిహారిక, జాయింట్ సెక్రెటరీ డి.హర్షవర్ధన్ రెడ్డి, ఎస్‌పిఎల్ జోత్స్న పాల్గొన్నారు.

టెక్కలి: మాతృభాషా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పురాణాలు, రామాయణాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ వి.లూక్‌పాల్, తెలుగు విభాగం అధిపతి వైవిసిహెచ్ లీలాపద్మజ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, అధ్యాపకులు తిరుమలరావు, సుగుణాకరరావు, సత్యన్నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తూరు: పాతపొన్నుటూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గుర్రాల కృష్ణారావు, తెలుగు ఉపాధ్యాయులు బొమ్మాళి నాగేశ్వరరావు, కుదమ తిరుమలరావు, అందవరపు రాజేష్, బూడిద సంతోష్ కుమార్, పైసక్కి చంద్రశేఖరం, యిస్త్రై సౌజన్యవతి పాల్గొన్నారు.

నరసన్నపేట: అంతర్జాతీయ మాతభాషా దినోత్సవం పురస్కరించుకొని పద్మావతి డిగ్రీకళాశాలలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఇన్‌ఛార్జి మూకళ్ల శ్రీనివాసరావు, చరిత్ర అధ్యాపకులు వై.పద్మనాభం, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగులో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.


శ్రీకాకుళం అర్బన్ : జాయ్‌కిడ్స్‌లో మాతృభాషా వేడుకలు


ఇచ్ఛాపురం : ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న కృష్ణమూర్తి రెడ్డి

శ్రీకాకుళం అర్బన్: ప్రతి ఒక్కరూ తప్పకుండా తమ మాతభాషలోనే మాట్లాడాలని జాయ్ కిడ్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్ కస్పాండెంట్ జామి స్రవంతి కిరణ్ అన్నారు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా జాయ్ కిడ్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలాగే ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మాతృభాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు కొంక్యాన మురళీధర్, పీజీ గుప్తా, గేదెల ఇందిరాప్రసాద్, జోగినాయుడు, బి.వి.రవిశంకర్, నందిగామ కామేశ్వరరావు, గుడ్ల జగ్గారావు, సుగంధం సంజీవరావు, మెట్ట దనుంజయ భట్ల, ఆనందరావు, ఎండ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా. సిహెచ్ ఉదయలక్ష్మి ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కదిలిన రెవెన్యూ అధికారులు

- ఆక్రమణల తొలగింపునకు ముమ్మర చర్యలు
- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన


పాఠశాల సరిహద్దును పరిశీలిస్తున్న అధికారుల బృందం

ప్రజాశక్తి- లావేరు

ఎట్టకేలకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలతో రెవెన్యూ, పంచాయతీ అధికారులు బృందం లావేరు జెడ్‌పి పాఠశాల ఆవరణలో అక్రమ నిర్మాణాల ఆక్రమణలు తొలగింపునకు ముమ్మరంగా చర్యలు చేపట్టారు. ప్రజాశక్తిలో పాఠశాల ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ అనే శీర్షికతో శుక్రవారం కథనం వెలువడడంతో జిల్లా కలెక్టర్ స్పందించారు. వెంటనే లావేరు తహశీల్దార్ ఎన్ని జోగారావును పాఠశాల స్థలం ఆవరణ, సరిహద్దు నిర్ధారణ, అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో హుటాహుటిన శుక్రవారం తహశీల్దార్, మండల సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, కార్యదర్శితో కూడిన బృందం పాఠశాల బౌండరీ హద్దులు, ఇప్పటికే వేసిన సరిహద్దులను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పశువుల కోసం రేకులషెడ్ నిర్మించిన వారితో మాట్లాడారు.

పాఠశాల స్థలంలో ఈ షెడ్ ఉందని, వెంటనే తొలగించాలని, తాత్సారం చేస్తే జెసిబితో తొలగిస్తామని తహశీల్దార్ చెప్పడంతో రెండురోజుల్లో తొలగిస్తామని ఆక్రమణదారులు చెప్పారు. అక్కడ నుంచి 14 షాపుల కాంప్లెక్స్ వద్దకు వచ్చి అక్కడ పరిశీలించిన అనంతరం షాపులు పాఠశాల స్థలంలో ఉన్నందున అన్నీ తొలగించాలని, త్వరితగతిన ఎవరు షాపు వారే ఖాళీ చేసి తొలగించాలని, లేకుంటే తామే మిషన్లు పెట్టి ఆక్రమ నిర్మాణాలు తొలగిస్తామని హెచ్చరించారు. వెంటనే షాపుల వివరాలు, ఆక్రమణదారుల పేర్లు పూర్తి సమాచారం నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పాఠశాల స్థలం సుభద్రాపురం, చీపురుపల్లి ప్రధాన రహదారికి ఆనుకుని ఉండడంతో రోడ్లు, భవనాల శాఖాధికారులు శనివారం వచ్చి పాఠశాల, ఆర్అండ్‌బి హద్దులు తేల్చేందుకు నిర్ణయించారు. అనంతరం తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ పరిశీలనలో మండల సర్వేయర్ బి.శ్రీధర్ రెడ్డి, ఆర్ఐ రాపర్తి అప్పలరాజు, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ లంకలపల్లి రాంబాబు, హెచ్ఎం పి.జగన్నాథరావు, లావేరు మాజీ జెడ్‌పిటిసి నిడిగంట్ల త్రినాథరావు, కార్యదర్శి దాలినాయుడు, విఆర్ఒ వేణుగోపాలరావు, సచివాలయ సర్వేయర్ నాయుడు, ఉపాధ్యాయులు ఉన్నారు.


షాపుల వివరాలు నమోదు చేస్తున్న విఆర్ఒ, కార్యదర్శులు


రవికుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న తెలుగు అధ్యాపకులు

ద్వితీయ భాషగా తెలుగు కొనసాగించాలి

పొందూరు: ఇంటర్మీడియట్‌లో ద్వితీయ భాషగా తెలుగునే కొనసాగించాలని కోరుతూ పియుసి చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ఆయన స్వగృహంలో శుక్రవారం తెలుగు అధ్యాపకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఇంటర్మీడియట్‌లో తెలుగు సబ్జెక్ట్ స్థానంలో ఇతర సబ్జెక్టులను విద్యార్థులు ఎంపిక చేసుకునే విధానం సరికాదని పేర్కొన్నారు. దీనివలన తెలుగుపై విద్యార్థుల ఆసక్తి తగ్గిపోతుందని, తద్వారా అమ్మ భాష మరుగున పడే అవకాశం ఉందని ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించాలని వారు కోరారు. వినతి పత్రం అందించిన వారిలో తెలుగు అధ్యాపకులు రాజేష్, రమణ పాల్గొన్నారు.

కళాశాలలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర

అరసవల్లి: ప్రభుత్వ మహిళా కళాశాలలో 'స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రతినెల మూడవ శనివారం అమలు చేస్తున్నామన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ, తరగతి గదులు, కళాశాల ఆవరణ పరిసరాల పరిశుభ్రత, మొక్కలకు నీరు సరఫరా చేయడం, చెత్తను శుభ్రం చేసి ఆ ప్రదేశంలో మొక్కలను నాటడం వంటి కార్యక్రమాలు చేయాల న్నారు. మరుగుదొడ్ల పరిశుభ్రత, వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీల నిర్వహణ, విజేతలకు బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. కళాశాలలోని వక్షశాస్త్ర విభాగాధిపతి ఎస్.రుద్రమరాణి కో- ఆర్డినేటర్‌గా వ్యవహరించగా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కవితా సంపుటి ఆవిష్కరణ

శ్రీకాకుళం అర్బన్: బరంపురం సాహితీ సంస్థ వికాసం ఆధ్వర్యాన శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రకాశం హాల్‌లో రొక్కం కామేశ్వరరావు 9వ కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరుగుతుంది. ఈ కవితా సంపుటిని వల్లూరి శివప్రసాద్ సమీక్షిస్తారు. ఈ సభలో అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ పాల్గొంటారు. ఇటీవల రొక్కం కామేశ్వరరావు అంతర్ముఖం తెలుగు కవితా సంపుటి ఆంగ్ల అనువాదాన్ని 2024 సంవత్సరానికిగాను కలకత్తాకు చెందిన పొయిట్ ఆఫ్ ది ఇయర్ అవార్డును యుకియోటో లిటరరీ సంస్థ అందజేసింది.

విజయగౌరిని గెలిపించాలి

ప్రజాశక్తి- కొత్తూరు


ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఈనెల 27న జరుగనున్న శాసనమండలి ఎన్నికల్లో పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర కోరారు. శుక్రవారం మండలంలో పలు ప్రాంతాల్లో ఆయన అధ్యాపకులను, ఉపాధ్యాయులను కలుసుకొని విజయ గౌరి సేవలను వివరిస్తూ, ఆమెకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా కుంటిభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లబ్బ ఎపి ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల, గొట్టిపల్లి పాఠశాలలో పర్యటించి ఆయన ప్రసంగించారు. నిస్వార్థమైన సేవలతో, నిరంతర పోరాటాలతో, నిష్కల్మషమైన కృషితో న్యాయపరమైన డిమాండ్ల సాధనకై శ్రమించే కుటుంబ నేపథ్యమున్న విజయగౌరిని గెలిపించాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో శ్రమిస్తున్న ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, మిత్రసంఘాలు బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలన్నారు. మండల శాఖ అధ్యక్షుడు కె.విజయకుమార్ మాట్లాడుతూ ఇప్పటివరకూ శాసనమండలికి పిడిఎఫ్ తరపున పద్నాలుగు మందిని గెలిపించి పంపించడం జరిగిందని అదే విధమైన మద్దతునివ్వాలన్నారు. ఈ పర్యటనలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.మధు, ఎం.కొండయ్య, డి.ప్రకాశరావు, జిల్లా కౌన్సిలర్లు కుదమ తిరుమలరావు, తూతిక సురేష్, సిఐటియు నాయకులు సిర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి బూత్ కమిటీ అధ్యక్షునిగా అశోక్

ప్రజాశక్తి- కవిటి


జగన్‌తో అశోక్

ఇచ్ఛాపురం నియోజక వర్గం వైసిపి బూత్ కమిటీ అధ్యక్షుడుగా కవిటి మండలం చండిపుట్టుగకు చెందిన ఎన్ని అశోక్ నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇచ్ఛాపురం నియోజకవర్గం అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. అందులో భాగంగా బూత్ కమిటీ అధ్యక్షుడిగా తనను నియమించినట్లు ఎన్ని అశోక్ తెలిపారు. 2015-16లో యువజన విభాగం కవిటి మండల అధ్యక్షుడుగా పనిచేసిన అశోక్‌కి పార్టీ ప్రస్తుతం పదోన్నతి కల్పించింది. అదేవిధంగా అంగన్వాడీ వింగ్ అధ్యక్షులుగా సనపల రోజా రాణి, లీగల్ సెల్ అధ్యక్షుడిగా పిన్నింటి జయరావు, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడుగా బెందాళం ఢిల్లీబాబు, ఇంటలెక్చువల్స్ ఫోరం అధ్యక్షుడిగా బర్ల నాగభూషణం నియమితులయ్యారు. వీరికి ఎంపిపి కడియాల పద్మ, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, పలువురు సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇచ్ఛాపురం: వైసిపి ఇచ్ఛాపురం నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షునిగా నర్తు ప్రేమ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనమీద నమ్మకంతో పదవి కట్టబెట్టిన పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డికి, ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎండిఎం మెనూ మార్పు

టెక్కలి: రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం మెనూలో స్వల్పమార్పులు చేస్తు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరం ముగింపు వరకు ప్రయోగాత్మకంగా అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ పథకం సంతృప్తికరంగా ఉంటే వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేసేందుకు యత్నాలు చేయనున్నారు. ప్రతి రోజు సోమవారం అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ, మంగళవారం అన్నం, గుడ్డుకూర, రసం, రాగిజావ, బుధవారం వెజ్‌పులావ్, ఆలూకుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ, గురువారం అన్నం, సాంబార్, గుడ్డు కూర, రాగిజావ, శుక్రవారం కూరగాయల అన్నం, చట్నీ, ఉడికించిన గుడ్డు, చిక్కీ, శనివారం అన్నం, కూర, రసం, రాగిజావ, స్వీట్‌పొంగలి చొప్పున్న బడి భోజనం మార్చనున్నారు. సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా కొత్త మెనూ అమలుకానుంది.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

పలాస: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం పలాస ఎమ్మెల్యే కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, యూనియన్ ప్రతినిధులు సిహెచ్ మురగన్, కె.వెంకటి, బి.కుర్మారావు మాట్లాడుతూ చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని కోరారు. పనిముట్లు ఇవ్వాలని, పాడైనా తోపుడు బండ్లు మరమ్మతులు చేయాలన్నారు. మున్సిపాలిటీలో తగిన శానిటేషన్ వర్కర్స్‌ను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఆప్కాస్ రద్దు నేపథ్యంలో కార్మికులు అందరిని పర్మినెంట్ చేయాలని, పని కాంట్రాక్టుకు ఇవ్వాలనే ఆలోచన విరమించాలని డిమాండ్ చేశారు. గత సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఇచ్చిన జిఒ ప్రకారం పండగ బోనస్ వెయ్యి రూపాయలు చెల్లించాలని కోరారు. కార్మికులు చనిపోయిన సందర్భంలో దహన సంస్కార ఖర్చులు ఇప్పించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎం.రవి, తిరుపతి, బాలకృష్ణ, రమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రజాశక్తి- కొత్తూరు


ఇప్పుడు కింద కూర్చున్న విద్యార్థులు ఐదేళ్ల తర్వాత స్టేజ్‌పైకి వచ్చే విధంగా గొప్ప వ్యక్తులుగా తయారవ్వాలని డిఇఒ టి.తిరుమల చైతన్య అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బండ రవికుమార్ అధ్యక్షతన 1974, 2024 గోల్డెన్ జూబ్లీ స్వర్ణోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ డబ్బు ముఖ్యం కాదని చదువు ముఖ్యమని, చదువుంటే అన్నింట్లో గౌరవం పెరుగుతుందన్నారు. కళాశాల మొట్టమొదటి ప్రిన్సిపాల్ ఎద్దు గోపాల్ దాసునాయుడు మాట్లాడుతూ ఆనాడు కళాశాల స్థాపించేందుకు చాలా కష్టపడితే వచ్చిందని, ఆ రోజుల్లో సుమారు 3 వేలు చందా వేసుకొని మొదలు పెట్టి అలాగే తన క్లాస్‌మేట్ ఆమదాలవలసకు చెందిన వైశ్యరాజు అప్పలరాజు పాతికవేలు డొనేషన్‌గా ఇవ్వడంతో అక్కడ నుంచి అలా ప్రతిఒక్కరు డొనేషన్ చేయడంతో లక్షల్లో చేరుకోవడంతో కళాశాల ఏర్పాటుకు సుగమం అయిందన్నారు. మాజీ ఎమ్మెల్యే కలమట మోహనరావుతో పాటు పలువురు సహకారంతో కళాశాల స్థాపించబడిందన్నారు. ఈ కళాశాల నుంచి సుమారు 50 సంవత్సరాల్లో 13 వేల మంది కళాశాల నుంచి బయటికి వెళ్లారన్నారు. ప్రతి పేద విద్యార్థికి నెలకు రూ.వెయ్యితో పాటు ఏడాదికి రూ.12 వేలు ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు కళాశాలలో పనిచేసిన కొంతమంది ప్రిన్సిపాళ్లు మాట్లాడుతూ సెల్ ఫోన్, క్రికెట్, చాటింగ్‌లకు దూరంగా ఉండాలన్నారు. అలాగే విద్యార్థులు డ్యాన్స్‌లతో ఆకట్టుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు కళాశాలలో పనిచేసిన ప్రిన్స్‌పాళ్లు, అధ్యాపకులను, పాత్రికేయులను, సిబ్బందిని దుశ్శాలువలు, జ్ఞాపకలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సోమలింగం, డి.సీతారాం, డాక్టర్ బి.ఎన్ చౌదరి, లోకనాథం మణిపాత్రో, నాగేశ్వర్, సుందరరావు, ఎస్.సూర్యకుమారి, ఎండి యాసిన్, అధ్యాపకులు ఎవిఎస్, ప్రభాకరరావు, తోట గోపాలరావు, టి.ఆదినారాయణ, పార్వతీశం, ఎంఇఒలు సిహెచ్ గోవిందరావు, ఎన్.శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు గోవిందరావు, డిఎల్ నరసింహంలు, సర్పంచ్‌లు లోతుగడ్డ భగవాన్ దాస్ నాయుడు, కుంచాల రత్నాలు, యుడిసి సుబ్బారావు, పూర్వ విద్యార్థులు లోతుగడ్డ లక్ష్మీనారాయణ నాయుడు, కుల శేఖర ఆల్వార్, బసవ రాంబాబు, పి.రామరాజులు, ప్రస్తుత అధ్యాపక బృందంతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఇఒ తిరుమల చైతన్య

మృత్యువాత పడుతున్న నాటుకోళ్లు

ప్రజాశక్తి- కవిటి

ఓవైపు బర్డ్ ఫ్లూ వ్యాధితో పౌల్ట్రీ పరిశ్రమ కుదేలవుతుంటే మరోవైపు పచ్చని తోటల్లో హుషారుగా తిరిగే దేశవాళీ కోళ్లు కూడా అకస్మాత్తుగా మృత్యువాత పడుతున్నాయి. కవిటి మండలం సహాలాలపుట్టుగలో గతవారం రోజులుగా సుమారు 40కిపైగా దేశవళి కోళ్లు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన ఈ దుర్యోధన, వై త్రినాధ్, ఈ ముత్యాలు, రవి ప్రధాన్ తదితరుల కోళ్లు మృత్యువాత పడ్డాయి. పగలంతా హుషారుగా తిరిగే కోళ్లు తెల్లారేసరికి మొహం నల్లగా మారి చనిపోతున్నాయని వారు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా ఈ విషయం గ్రామస్తులెవరూ పశువైద్య సిబ్బందికి తెలియజేయకపోవడం శోచనీయం.


తోటల్లో తిరుగుతున్న కోళ్లు

బర్డ్ ఫ్లూ కాదు

సహలాలపుట్టుగలో వరుసగా కోళ్లు చనిపోతున్నట్టు ఇంతవరకు ఎవరు సమాచారం ఇవ్వలేదు. వెంటనే సిబ్బందితో కలిసి గ్రామంలో మా సేవలు అందిస్తాం. అయితే ప్రస్తుతానికి కవిటి మండలంలో బర్డ్ ఫ్లూ వ్యాధి లేదు. కోళ్లు పరిశీలించిన తర్వాత మాత్రమే ఎందుకు చనిపోతున్నాయి అనే విషయం తెలుస్తుంది.

- డాక్టర్ కిరణ్, పశువైద్యాధికారి, కవిటి

ఆరు కోళ్లు చనిపోయాయి

తన 6 కోళ్లు చనిపోయాయి. మా పిన్ని ఈ ముత్యాలువి ఐదు కోళ్లు చనిపోయాయి. ఉదయం బాగానే ఉంటున్నాయి. తోటల్లో హుషారుగా తిరుగుతున్నాయి. రాత్రి ఇంటికి వచ్చిన తర్వాత తెల్లవారి చూసేసరికి చనిపోతున్నాయి. వాటి మొహం నల్లగా మారుతోంది. ఎందుకు చనిపోతున్నాయో తెలి యడం లేదు. గ్రామంలో చాలా కోళ్లు ఈ విధంగానే చనిపోయాయి.

- దుర్యోధన, సహలాలపుట్టుగ

అపరాల్లోనూ అవస్థలే...

- పెట్టుబడులు రాని వైనం
- రైతులను దోచుకుంటున్న దళారులు

ఖరీఫ్, రబీ, ఏ సీజనైనా రైతులకు ఒరిగింది లేదు. ఎప్పటి మాదిరిగానే రైతులు నష్టాలు చవి చూస్తూనే ఉన్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు.

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వరి పండించిన రైతులకు నిరాశ ఎదురైంది. ఒకవైపు మద్దతు ధర లభించకపోవడం, మరొకవైపు పండించిన పంటలు ఇంకా వరికుప్పలు కల్లాల్లోనే ఉండిపోవడం రైతులను తీవ్రంగా వేధిస్తుంది. రైతులకు రబీ సీజన్ అనగానే గుర్తుకొచ్చేది పెసర, మినుము పంటలు. ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులు రబీ సీజన్‌లో పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభిస్తుందని, అపరాల పంటల వల్ల లాభాలను కళ్ల చూస్తా మన్న ఆశతో మండలంలోని రైతులు అపరాల పంటల వైపు దృష్టి సారిం చారు. మార్కెట్‌లో పెసర, మినుము పంటలకు మంచి గిరాకీ ఉందన్న ఆశతో మండలం మామిడివలస, లాభా ం, కొల్లివలస, ఉప్పినివలస, తోటవాడ, తుడ్డలి తదితర గ్రామాల్లో ఈ పంటలను పండించేందుకు ముందుకు వచ్చారు.

వరుణుడి దెబ్బ

మంచి దిగుబడి వస్తుందన్న ఆశతో ఉన్న రైతులకు వరుణుడు దెబ్బ తీశాడు. అల్ప పీడనం కారణంగా రెండు దపాలుగా విస్తారంగా వర్షాలు పడడంతో పెసర, మినప మొక్కలు మొక్క దశలోనే వర్షం నీటిలో మునిగిపోవడంతో ఆ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు.


మినప చేనును కుప్పలు పెడుతున్న రైతులు


దళారులదే రాజ్యం

పంటల నష్టం వాటిల్లి లబోదిబోమంటున్న రైతులను దళారులు నిండా ముంచేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వింటా పెసర రూ.8.500 నుంచి రూ.9 వేలు కాగా కేవలం దళారులు రూ.6.500 చొప్పున కొనుగోలు చేస్తున్నారని, అలాగే రూ.5 వేలుకే మినుములు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. దీంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

తాము పంటలు నష్ట పోయామని, ఆదుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు. అపరాల పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం కొనుగోలు చేయాలి



పండించిన పెసర, మినుములను మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. గిట్టుబాటు ధర కల్పించాలి. రైతులను ఆదుకోవాలి.

- భవిరి కృష్ణ, బూర్జ

దళారుల ఇష్టారాజ్యం



దళారులు చెప్పిందే రేటు. అంతా వాళ్ళ ఇష్టం. దీనివలన తాము తీవ్రంగా నష్టపోతున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి. నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

- గంగు అజయ్‌కుమార్, బూర్జ



పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సుధాకరరావు

పూర్తిస్థాయిలో ఫారం పాండ్స్ నిర్మాణం

డ్వామా పీడీ బి.సుధాకరరావు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఫారం పాండ్స్ పనులు పూర్తిస్థాయిలో చేయాలని, అలా కాకుండా సగం పనులు చేసి వదిలేస్తే అవి నిరుపయోగంగా మారుతాయని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు బి.సుధాకరరావు అన్నారు. మండలంలోని చిలకపాలెం పంచాయతీలో ఫారం పాండ్స్ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం పాండ్స్ అవుట్‌లెట్, ఇన్‌లెట్‌తో పాటు రాతి యాప్రాన్ పనులనూ చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సిసి రహదారి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎపిఒ శోభాదేవి, ఇసి నారాయణమ్మ, టి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర పాడి రైతుల 'పాల' పోటీలు

ప్రజాశక్తి- కవిటి

మార్చి 14 నుంచి 16 వరకు విజయనగరం తోటపాలెంలోని కె.వైకుంఠరావు డెయిరీ ఫామ్‌లో ఉత్తరాంధ్ర పాడి పశువుల పాల పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల ఇన్‌ఛార్జి, పశు వైద్యులు డాక్టర్ కిరణ్ తెలిపారు. ఆధునిక, శాస్త్రీయ పరిజ్ఞానం వినియోగించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించి పశుపోషణ లాభసాటిగా మార్చాలని, ఔత్సాహిక నిరుద్యోగ యువతను పాడి పరిశ్రమ వైపు ఆకర్షించాలని, పాడి రైతుల్లో ఆరోగ్యకరమైన పోటీ పెంపొందించాలనే ఉద్దేశంతో పశుసంవర్ధక శాఖ, బొవైన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఈ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పోటీలో పాల్గొనే పశువులకు ఉచిత రవాణా సదుపాయంతో పాటు అక్కడ ఉన్నన్ని రోజులు పశువులకు ఉచిత దాణా, రైతులకు ఉచిత వసతి సదుపాయాలు కల్పిస్తున్నట్టు డాక్టర్ కిరణ్ తెలిపారు. పూర్తి వివరాలకు సమీపంలోని పశువైద్యశాలలో సంప్రదించాలని ఆయన సూచించారు. సుమారు రూ.15 లక్షల విలువైన బహుమతులు అందించనున్న ఈ పాడి పశువుల పాల పోటీలను ఉత్తరాంధ్ర జిల్లాల పాడి రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.



విజేతలను అభినందిస్తున్న మధులత

ఓక్లాండ్ విద్యార్థుల ప్రతిభ

టెక్కలి: స్థానిక ఓక్లాండ్ అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ మళ్లా మధులత తెలిపారు. సుచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్.సివిరామన్ యంగ్ జీనియస్ వారు నిర్వహించిన నైపుణ్య పరీక్షల్లో తమ పాఠశాలలో రెండవతరగతి చదువుతున్న క్రిషన్ చౌదరి, 7వతరగతి చదువుతున్న బి.ప్రహ్నవిలు జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. హైదరాబాద్‌లోని లలిత కళాతోరణంలో నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవంలో భాగంగా సినీ నటుడు రావు రమేష్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతులమీదుగా బహుమతులందుకున్నారని తెలిపారు. వీరిని శుక్రవారం పాఠశాలలో అభినందించినట్లు మధులత తెలిపారు. ఈ సందర్భంగా మధులత మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగిఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి ప్రతిభా పరీక్షలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శిథిలావస్థకు చేరిన కల్వర్టు

శిథిలావస్థలో కల్వర్టు

మెళియాపుట్టి: మండలంలో భరణికోట కాలనీ వద్ద ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. గెడ్డవాగు నీరు వెళ్లేందుకు వీలుగా ఈ కల్వర్టు ఏర్పాటు చేశారు. కల్వర్టు శిథిలావస్థకు చేరుకోవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది కలిగే పరిస్థితి ఏర్పడింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కల్వర్టును అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

రోస్టర్ సరిచేసి గ్రూప్-2 పరీక్షలు నిర్వహించాలి

గ్రంథాలయం ఎదుట అభ్యర్థుల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎపిపిఎస్‌సి ఆధ్వర్యాన విడుదలైన గ్రూప్-2 నోటిఫికేషన్‌లో రోస్టర్ విధానంలో తప్పులను సరిచేశాక మెయిన్ పరీక్షలు నిర్వహించాలని గ్రూప్-2 అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. గ్రూప్స్‌లో ఉద్యోగం సాధించడం అభ్యర్థుల కల అని, అందుకోసం ఏళ్ల తరబడి వ్యయ ప్రయాసల కోర్చి శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులకు నోటిఫికేషన్‌లో పేర్కొన్న రోస్టర్ వల్ల తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. 2023 డిసెంబరులో ప్రభుత్వం ఇచ్చిన గ్రూప్-2 నోటిఫికేషన్‌లో 77 జిఒ ప్రకారం రిజర్వేషన్ కేటాయించలేదని, ఒసి, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇడబ్ల్యుఎస్‌లో మాత్రమే స్త్రీల కోటా, పిడబ్ల్యుడి, ఎక్స్-సర్వీస్, స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్లు పొందుపరిచారని చెప్పారు. ఈ నోటిఫికేషన్‌లో పాత పద్ధతి ప్రకారం రిజర్వేషన్లు కేటాయించడం వల్ల కొందరికి తీరని అన్యాయం వాటిల్లుతోందన్నారు. రోస్టర్‌ను సరిచేయకుండా గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. రోస్టర్ క్లియర్ చేయకుండా మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తే కోర్టు తీర్పును అనుసరించి నోటిఫికేషన్ రద్దయ్యే ప్రమాదముందన్నారు. అందువల్ల తక్షణమే రోస్టర్‌లో తప్పొప్పులను సరిదిద్ది పరీక్షలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో అభ్యర్థులు పి.నవీన, జి.సునీంద్ర, టి.జగదీష్, ఎం.అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేపడుతున్న గ్రూప్-2 అభ్యర్థులు

పరిశోధనలపై దృష్టిసారించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

పిజి, పిహెచ్‌ఐ విభాగాల్లో పరిశోధనలు చేస్తున్న విద్యార్థులు నాణ్యతపై దృష్టి సారించాలని జెఎన్‌టియుజివి ఆర్‌ఎన్‌డి డైరెక్టర్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు కోరారు. టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఆర్‌ఎన్‌డి సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన పరిశోధకుల సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2024-2025 విద్యా సంవత్సరంలో ఐతమ్ రీసెర్చ్ విభాగం ద్వారా ఐతమ్ ప్రొఫెసర్ల మార్గదర్శకత్వంలో పిహెచ్ చేయుటకు 31 మంది జాయిన్ అవ్వడం హర్షనీయమన్నారు. కేవలం పట్టాల వల్ల ప్రయోజనం లేదని, నాణ్యతా ప్రమాణాలు పాటించిన వారికి ఆలస్యంగా అయినా మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. జర్మనీ డ్రెస్డెన్ టెక్నికల్ యూనివర్శిటీ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ సునీల్ కుమార్ శర్మ గౌరవ అతిథిగా పాల్గొని పిహెచ్‌ఐల ఆవశ్యకత, అంతర్జాతీయంగా వాటికి ఉన్న గుర్తింపును వివరించారు. పరిశోధనలు చేస్తున్న వారంతా శ్రమించి సమాజానికి అవసరమైన అంశాలను ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురించాలన్నారు. కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఐతమ్ రీసెర్చ్ కేంద్రం ద్వారా ఇప్పటికే 12 మంది పిహెచ్ డిగ్రీలు పొందగా 42 మంది వివిధ దశల్లో ఉన్నారన్నారు. డీన్ డాక్టర్ డి.శ్రీరాములు కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ సదస్సులో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్లు, హెచ్‌డిలు, గైడ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్వామినాయుడు

ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు



డాన్స్‌లు చేస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు ప్రణాళికా బద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రమేష్ పట్నాయక్ అన్నారు. శుక్రవారం పూండి, గోవిందపురం జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులు వీడ్కోల సభ నిర్వహించారు. పరిక్షల్లో మంచి మార్కులు తీసుకువచ్చి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్, టీవీలకు దూరంగా ఉండి చదువుపై ధ్యాస ఉంచాలన్నారు. చదువు, ఆటల్లో ముందు వరుసలో ఉన్న విద్యార్థులు అనుకున్న లక్ష్యాలకు చేరుకుంటారన్నారు. పాఠాలు బోధించిన గురువులకు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎంలు హరిబాబు, సీతారాజు, చంద్రశేఖర్, తిరుపతిరావు, లక్ష్మణరావు, అధ్యాపకులు రూపు సుందర్, తిరుపతి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య

ప్రజాశక్తి- మెళియాపుట్టి

భూమి ఉన్న ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్య (14 అంకెలు కలిగిన సంఖ్య) ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకొని రావటం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని ఎఒ ఎస్. దానకర్ణుడు అన్నారు. రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమమన్నారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుందన్నారు. భూ ఆధారిత పథకాలైన పిఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల భీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రాయితీపై సూక్ష్మ పోషకాలు, పెట్టుబడి సాయం పథకాలు నేరుగా పొందేందుకు ఉపయోగపడుతుందన్నారు. రైతులందరూ రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి, ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకుని రైతు గుర్తింపు సంఖ్య పొందాలన్నారు.

నమోదు విధానం

రైతులు వారి ఆధార్ నెంబర్, ఆధార్ అనుసంధారిక ఫోన్ నెంబర్, భూమి రికార్డుల వివరములు (పట్టాదారు పాస్ బుక్) తీసుకొని గ్రామంలో రైతు సేవా కేంద్రం సిబ్బందిని కలిసి రిజిస్ట్రేషన్ చేసుకుని విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని మండల వ్యవసాయ అధికారి రైతులను కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకునిగా ఈశ్వరరావు

వజ్రపుకొత్తూరు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చీపురుపల్లి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చా ఈశ్వరరావును నియమిస్తూ టిడిపి రాష్ట్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల విస్తృతస్థాయి సమావేశంలో ఎన్నికల పరిశీలకునిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ఉమ్మడి అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయనతో పాటు వజ్రపుకొత్తూరు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కర్ని రమణ పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

ఇచ్ఛాపురం: ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని టిడిపి సీనియర్ నేత లోపింటి పద్మనాభం అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామారావు, నీటి సంఘం అధ్యక్షుడు దక్కత కామేశ్వరరావు తది తరులు పాల్గొన్నారు.

ఆధార్‌కు ఫోన్ నంబరు జోడించాలి

సీతంపేట: మండలంలోని ప్రజలంతా తప్పనిసరిగా ఆధార్ నెంబర్‌కు ఫోన్ నెంబర్ను జోడించాలని ఎంపిడిఒ కె.గీతాంజలి అన్నారు. మండలంలోని సీతంపేట-1, గొయిది, కిల్లాడ, ధారపాడు సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి వ్యక్తికి ఆధార్ నమోదు తప్పనిసరిగా ఉండాలన్నారు. మండల ప్రజలంతా తప్పనిసరిగా ఆధార్ నమోదు చేయించు కోవాలని, దీన్ని వినియోగించు కోవాలని కోరారు. ముఖ్యంగా చిన్నపిల్లలు ఆధార్ నమోదు లేకుండా ఉన్నవారు తప్పని సరిగా దగ్గరలోని ఆధార్ నమోదు కేంద్రానికి తీసుకొచ్చి వారికి ఆధార్ నెంబర్ వచ్చేలా చూడాలన్నారు. ఎంపిడిఒ వెంట సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆనపకాయ గూడలో 20 లీటర్ల సారా స్వాధీనం

సీతంపేట: మండలంలోని ఆనపకాయగూడలో 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వై.అమ్మనరావు తెలిపారు. సారా విక్రయించినా, తయారుచేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటుసారా రవాణా చేసిన వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ అందజేత

కోటబొమ్మాళి: మండలం వీరరాఘవపురం ప్రాథమిక పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి, శ్రీకాకుళం ఐడిబిఐ బ్యాంక్ మేనేజర్ ముద్దాడ శ్రీకాంత్ సిఎస్ఆర్ ఫౌండ్ ద్వారా ఉచితంగా బీరువ, కంప్యూటర్, ప్రింటర్ ఫర్నిచర్‌ని మండల విద్యాశాఖాధికారి ఎల్.వి. ప్రతాప్, జనసేన నాయకులు పల్లి కోటేశ్వరావుల చేతులమీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తేజేశ్వరరావుకు శుక్రవారం అందజేశారు. బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్ మాట్లాడుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా చదువుతో పాటు మంచి క్రమశిక్షణ, నడవడిక వస్తుందని తల్లిదండ్రులకు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ప్రతిఒక్కరూ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆంపోజు వల్లి, బ్యాంకు సిబ్బంది గణపతి, తారక్, సాయి, దిలీప్, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



కంప్యూటర్‌ను వితరణగా అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

జాతర బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన



జాతర ఏర్పాట్లును పరిశీలిస్తున్న సిఐ సత్యనారాయణ

ప్రజాశక్తి- పొందూరు

మండలం దల్లవలసలో శనివారం నుంచి ప్రారంభం కానున్న రాజరాజేశ్వరి (రాజులమ్మ) అమ్మవారి జాతర ఏర్పాట్లును శుక్రవారం సిఐ పి.సత్యనారాయణ పరిశీలించారు. రెండురోజుల పాటు జరిగే ఈ జాతరలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండేలా పోలీసులు ఏర్పాట్లును చేపట్టారు. జాతర ఏర్పాట్లుకు సంబంధించి సెక్రటరీ జగదీష్, సచివాలయ సిబ్బందితో పాటు కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రెండేళ్లకు నిర్వహించే ఈ జాతరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఒడిశా రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున యాత్రికులు తరలివస్తారు. ఈయనతో పాటు ఎస్ఐ వి.సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

మెరైన్ పోలీసుల బీచ్ క్లీనింగ్

ప్రజాశక్తి- సోంపేట

బారువ మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం బీచ్ క్లీనింగ్ కార్యక్రమం చేపట్టారు. మెరైన్ సిఐ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో మెరైన్ సిబ్బంది, పంచాయతీ రాజ్, పారిశుధ్య కార్మికులతో పాటు స్థానిక పూర్వ విద్యార్థుల సంఘం, యువజన సంఘాల సభ్యులు సుమారు 200 మంది తీర ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. బారువ తీరం వెంబడి పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి మన పరిసరాలు, మన తీర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం అంటూ నినదించారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్ఐలు శిరీష, శ్రీనివాసరావు, సిబ్బంది కోదండరావు, మాధవరావు, శాంతమూర్తి, సింహాచలంతో పాటు మాధవరావు, ఎల్.లింగరాజు, కామేశ్వరరావు, సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న మెరైన్ పోలీసులు, విద్యార్థులు

అధ్యాపకుని ఔదార్యం

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎకనామిక్స్ విభాగం అధ్యాపకులు తన ఔదార్యాన్ని చాటుకున్నారు. కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ కార్యాలయానికి రూ.40 వేలతో ఆధునీకరణ పనులు చేపట్టారు. ఈ మేరకు విరాళదాత రామారావు చేతులమీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ ఏడాది అక్టోబర్ నెలలో ఉద్యోగవిరమణ చేయనున్న సందర్భంగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి నోటిఫికేషన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఉన్న ఎపి మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యాసంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. మార్చి 31లోగా అభ్యర్థులు ఈప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 20న ప్రవేశపరీక్ష ఉంటుందని, మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుందని తెలిపారు.

కృష్ణచైతన్య పరామర్శ

ప్రజాశక్తి- పోలాకి

వైసిపి నాయకులు, మండల వైస్ ఎంపిపి కోట అప్పారావు భార్య సింకమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో శుక్రవారం మండల జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య పరామర్శించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అప్పారావుని ఓదార్చారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ప్రజా దర్బార్

ఆమదాలవలస: పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద ఈనెల 22న ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి సనపల ఢిల్లీశ్వరరావు తెలిపారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు నిర్వహించనున్న ప్రజాదర్బార్‌లో నాలుగు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు అందించవచ్చునని ఆయన తెలిపారు.

యువత రక్తదానం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని దమ్మలవీధిలో నీలమ్మతల్లి వాడ బలిజ సేవాసంఘం ఆధ్వర్యాన శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. టిడిపి నాయకులు మైలపల్లి నర్సింహమూర్తి జన్మదినాన్ని పురష్కరించుకుని చేపట్టిన ఈకార్యక్రమంలో ముందుగా కేక్ కట్ చేశారు. అలాగే అనురాగ నిలయంలో అన్నదానంతో పాటు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మైలపల్లి మన్మథరావు, మైలపల్లి రాంబాబు, రాయితీ చంద్రశేఖర్, రాయితీ శ్రీనివాసరావు, గణగళ్ల మూర్తి, గణగళ్ల కొర్లయ్య, కొండా సింహాచలం, బర్రి మురళీ, కేశవ రాంబాబు, కొమర మురళీ, సూరాడ సత్యం, చోడిపిల్లి కన్నా, కారి బాలాజీ, మండల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



శాంతారాంను సత్కరిస్తున్న సభ్యులు

ప్రథమ చికిత్సతో ప్రాణాలు కాపాడొచ్చు

పొందూరు: ప్రమాద సమయంలో గాయపడిన వారికి ప్రథమ చికిత్సను అందించడం ద్వారా వారి ప్రాణాలను కాపాడవచ్చునని ఎంఇఒ-2 పట్నాన రాజారావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు కాళ్లకూరి శాంతారాం అన్నారు. స్థానిక కళ్యాణ మండపంలో శుక్రవారం స్థానిక ఆడపిల్ల సేవాసొసైటీ చైర్‌పర్సన్ మద్ది లావణ్య ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్‌సిసి విద్యార్థులకు సిపిఆర్ ఏ విధంగా చేయాలి, ప్రమాద సమయంలో అవయవాలకు కలిగిన గాయాలకు ఏ విధంగా చికిత్సను అందించాలన్న విషయాలను తెలియజేశారు. అనంతరం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులను ఘనంగా సత్కరించారు. సొసైటీ ట్రైనర్స్ రమణ, సత్యనారాయణ, పవన్ పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

భవిష్యత్ నాశనం చేసుకోవద్దు

పొందూరు: యువత గంజాయి, నాటుసారా, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు బానిసై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోరాదని ఎస్ఐ వి.సత్యన్నారాయణ అన్నారు. మండలంలోని లుట్టపేటలో శుక్రవారం సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారి వ్యవహార శైలిని ఎప్పటికప్పుడు పరిశీలించు కోవాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తూ పట్టుబడితే కేసులు ఎదుర్కొని జైలు జీవితం గడపాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం రైల్వేస్టేషన్ రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలు వివరించారు.